'ముసురు' భయం!

- వర్షానికి దెబ్బతింటున్న మిరప,పత్తి, ఉల్లి పంటలు
- వరి రైతుల్లో తుపాన్ భయం
- మేఘావృతంతో ఆందోళన
- వరి కోతలు వాయిదా వేయాలని అధికారుల సూచన

కృష్ణగిరి: ఈ యేడాది అధిక వర్షాలకు ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ, ఆముదం, పత్తి, మిరప పంటలు పూర్తిగా దెబ్బతినగా రైతన్నలు నష్టాలు మూటగట్టుకున్నారు. ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉంది. అక్కడక్కడా కోతలు కోసి ధాన్యాన్ని ఆరబోసుకున్నారు. ఈ సమయంలో తుపాన్ గండం అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేసేలా ఉంది. శుక్రవారం తెల్లవారుజామున వర్షం పడటంతో పంట చేతికొచ్చే సమయంలో పంట వర్షార్పాణం అయ్యేలా ఉందని ఆవేదన చెందుతున్నారు. మండలంలో ఈ సారి రికార్డు స్థాయిలో దాదాపుగా 2 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. చెరువులు, బోరు, బావులు, హంద్రీనీవా రిజర్వాయర్‌తోపాటు హంద్రీనీవా ప్రధాన కాల్వ వెంట, హంద్రీ బద్దున ఉన్న గ్రామాల్లో జూన్, జూలై నెలల్లో వరి పంట సాగు చేయగా ఇప్పుడు కోతకు వచ్చింది. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ వర్షాలు పడుతుండటం, మరో రెండు రోజులు ఇలాగే ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండటంతో అన్నదాతల్లో గుబులు మొదలైంది.



పెనుమాడ చెరువు కింద కోతకు వచ్చిన వరి పంట



హొళగుంద సమీపంలో వర్షానికి నేలకొరిగిన వరి పైరు

హొళగుంద: మండలంలో గురు, శుక్రవారం తుపాను ప్రభావంతో వర్షం కురిసింది. దీంతో హొళగుంద, గజ్జహళ్లి, వందవాగిలి, మార్లమడికి, హెబ్బటం తదితర గ్రామాల్లో కురిసిన వర్షానికి వరి పంట నేలకొరిగి దెబ్బతింది. మండలంలో ఆయా గ్రామాల్లో వేలాది ఎకరాల్లో సాగు చేసిన పంటలు దెబ్బ తింటుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షానికి వరితో పాటు విరగ్గాసిన పత్తి నేల పాలవుతుండగా, మిరప, ఉల్లి పొలాల్లో నీరు నిలిచి మొక్కలు దెబ్బతింటున్నాయి. తుంగభద్ర దిగువ కాలువ కింద సాగు చేసిన పంటలు ప్రస్తుతం చేతి కందే దశలో ఉన్నాయి. ఈ తరుణంలో కురుస్తున్న గాలి వానకు పైరు నెలకొరిగి గింజలు నేలపాలయ్యాయి. ఇప్పటికే కోతలు చేసి నిల్వ ఉంచిన ధాన్యాన్ని టార్పాళ్లతో కప్పి కాపాడుకుంటున్నారు. ఎకరాకు దాదాపు రూ.25 వేల వరకు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసామని పంటలు చేతికొస్తున్న సమయంలో పైరు నెలకొరగడం వల్ల గింజలు రాలి దిగుబడి తగ్గే అవకాశముందని రైతులు వాపోతున్నారు. కాగా మండలంలో వరి 5వేల ఎకరాలు, పత్తి 17వేల ఎకరాలు, మిరప 10వేల ఎకరాల్లో సాగయ్యాయి.



హొళగుంద వద్ద ఎల్లెల్సీ కాల్వ గట్టుపై ఆరబోసుకున్న ధాన్యం తడవకుండా పట్టలు కప్పిన దృశ్యం

వరి కోతలు వాయిదా వేసుకోండి

తుపాన్ ప్రభావం మనకు ఎక్కువగా లేకపోయినా మండలంలో గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారు జామున వర్షం పడింది. దీంతో మరో రెండు రోజులు ఆకాశం మేఘావృతమై ఉండే అవకాశం ఉంది. కావున మండల వ్యాప్తంగా రైతులు వరి కోతలను వాయిదా వేయాలి. కోసిన పంటను కుప్పలుగా వేసుకుని టార్పాళ్లతో కప్పుకోవాలి. అలాగే వర్షం వస్తే నీరు నిల్వ లేకుండా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. ఇతర పంటలకు మందులు పిచికారీ కూడా చేయరాదు. – ఎస్. వెంకటేశ్వర్లు, ఏఓ, కృష్ణగిరి



హొళగుంద కొండకు కమ్ముకున్న ముసురు



వరి పనలను పొలంలోనే ఉంచిన దృశ్యం

క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



హారతి ఇస్తున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

ఆలూరు: చెడు వ్యవసాలకు దూరంగా ఉంటూ సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపేందుకు కార్తీక మాసం ఉపయోగపడుతుందని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి అన్నారు. శుక్రవారం సత్యనారాయణ స్వామి, ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలోప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీపీ రంగమ్మ ,వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు బోయ ఎల్లమ్మ, మోతి ఎల్లమ్మ,దేవరాజ్, మండల కో–కన్వీనర్ వీరేష్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే సోదరుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠోత్సవాలు

తుగ్గలి : మీటీతండా సమీపంలోని బోడబండ కొండలో శనివారం నుంచి రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పురాతనమైన ఆలయాన్ని భక్తుల విరాళాలు, ఉప్పర్లపల్లి గ్రామ ప్రజల సహకారంతో రూ.60 లక్షలకుపైగా వెచ్చించి జీర్ణోద్ధరణ గావించారు. అయోధ్యలో బాల రాముని విగ్రహం తయారుచేసిన మైసూర్‌కు చెందిన శ్రీ అరుణ్ యోగిరాజ్‌తో శివలింగాన్ని తయారు చేయించినట్లు సర్పంచ్ ప్రభాకరరెడ్డి తెలిపారు. ఈనెల 18న బ్రహ్మశ్రీ గుండు రామనాథశాస్త్రి ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మద్దమాంబకు విశేష పూజలు

మద్దికెర : స్థానిక మద్దమాంబ అమ్మవారికి శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం కుంకుమార్చన, మహామంగళహారతి, నైవైద్యం వంటి కార్యక్రమాలు జరిపించారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట

కృష్ణగిరి: ముందస్తు పరీక్షలతోనే క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయవచ్చని వైద్యాధికారి ప్రదీప్ అన్నారు. చిట్యాల, కోయిలకొండ తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న క్యాన్సర్ సర్వేను శుక్రవారం పరిశీలించారు. క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్ పరీక్షలతో సాధ్యమవుతుందన్నారు.

కూలీలందరికీ ఉపాధి పనులు

మద్దికెర : వ్యవసాయ కూలీలందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని, నిబంధనల మేరకు పనులు పూర్తి చేయాలని ఏపీఓ నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బొజ్జనాయునిపేట గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు.

108 ఉద్యోగుల సమ్మె నోటీసు

వెల్దుర్తి(కృష్ణగిరి): సమస్యలు పరిష్కరించనందున సమ్మె నోటీసును శుక్రవారం మండల స్థాయి అధికారులకు 108 సిబ్బంది షేక్ ఉస్మాన్‌బాషా, యూనిస్ బాషా, ఖాదర్‌బాషా, లక్ష్మన్న అందజేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఈ నెల 25వ తేదీ నుంచి సేవలను నిలిపివేస్తామని తెలిపారు.

ఓల్టేజీ సమస్యను పరిష్కరించండి

హొళగుంద: స్థానిక ఈబీసీ కాలనీలో కొన్నేళ్లుగా లో, హై ఓల్టేజీ సమస్య వేధిస్తుందని, పరిష్కరించాలని ఎస్‌డీపీఐ నాయకులు, కాలనీ వాసులు శుక్రవారం ట్రాన్స్‌కో ఏఈ ఓబులమ్మకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఓల్టేజీ సమస్య వల్ల ఫ్రిజ్‌లు, టీవీలు, కుక్కర్లు తదితర ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

గరుడ వాహనంపై ఊరేగిన రంగనాథుడు



గరుడవాహనంపై విహరిస్తున్న రంగనాథుడు

మద్దికెర : పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి వారు శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా సతీసమేతుడై గరుడ వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో జ్వాలాతోరణం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. అనంతరం జ్వాలా తోరణాలతో స్వాగతం పలికారు. .

గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులే కీలకం

తుగ్గలి : గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు కీలకమని ఎంపీడీఓ విశ్వమోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. చివరి రోజు ఈవోపీఆర్డీ శ్రీహరి శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప, కార్యాలయ ఏఓ ఎస్‌ఎం బాషా, జూనియర్ అసిస్టెంట్ రాంబ్రహ్మం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై విచారణ



వెల్దుర్తిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ లక్ష్మి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పలు సమస్యలపై కొందరు లోకాయుక్తలో ఫిర్యాదు చేయడంతో శుక్రవారం విచారణ చేపట్టినట్లు డీఎల్‌పీఓ లక్ష్మి తెలిపారు. పంచాయతీ పరిధిలోని నలుగురు పలు సమస్యలపై ఫిర్యాదు చేయడంతో గతంలో ఇక్కడ పనిచేసిన ఈఓఆర్డీ, ఈఓ, సీనియర్ అసిస్టెంట్‌లను విచారించామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వివరించారు.

సమరయోధులను స్మరించుకోవాలి

మద్దికెర : దేశం, జాతుల కోసం పోరాడిన సమర యోధులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవడమే గాకుండా వారి అడుగుజాడల్లో నడవాలని డీఎల్‌పీఓ వీరభద్రప్ప అన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ ఆవరణలో భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి, గిరిజన గౌరవ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బిర్సా ముండా బ్రిటీష్ వారిపై యుద్ధం ప్రకటించిన వీరడన్నారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ సుహాసిని, ఎంపీడీఓ కొండయ్య, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజన్న, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ వీరభద్రప్ప

ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి

దేవనకొండ: విద్యుత్ ట్రూఅప్ చార్జీలను వెంటనే రద్దు చేసి, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, అశోక్, సూరి డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రజలకు మేలు చేయకుండా భారం మోపుతుండటం సరికాదన్నారు. మహేష్, కౌలుట్ల, బండ్లయ్య, రాముడు, సుధాకర్ పాల్గొన్నారు.

తుగ్గలి : కూటమి ప్రభుత్వానికి ప్రజా సమస్యలు పట్టడం లేదని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు విమర్శించారు. ప్రజాపోరులో భాగంగా శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని ఆరోపించారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుతో పేద, బడుగు, బలహీన వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ప్రభుత్వ భవనాలను నిర్మించండి

హొళగుంద: స్థానిక 4వ వార్డులో పారిశుద్ధ్యం లోపించి వ్యాధులు ప్రబలడానికి కారణమవుతున్న ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలంలో అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలను నిర్మించాలని కాలనీవాసులు కోరారు. శుక్రవారం వార్డు వాసులు ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, సర్పంచ్ చలువాది రంగమ్మ, ఎంపీడీఓ విజయలలిత, డీటీ నిజాముద్దీన్‌లకు వినతి పత్రాలను సమర్పించారు. వారు మాట్లాడుతూ కాలనీలో 9 సెంట్ల ప్రదేశంలో వార్డులో అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాల నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

టీడీపీలో రచ్చకెక్కిన వర్గ విభేదాలు

ఆలూరు: నియోజకవర్గంలోని టీడీపీ నాయకుల మధ్య వర్గ విభేదాలు రచ్చకెక్కాయి. ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడు తనకు కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను కేటాయించలేదని స్థానిక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అరుణాదేవి శుక్రవారం అంబేడ్కర్ సర్కిల్‌లో మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈమెకు చిప్పగిరి మండల మాజీ కన్వీనర్ షేక్షావలి, ఎంపీటీసీల సంఘం రాష్ట్ర మాజీ కోశాధికారి మద్దలేటియాదవ్, సర్పంచ్ బంధువులు బెంగళూరు కిశోర్, కట్టెల మహేష్ తదితరులు మద్దతు ప్రకటించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల కేటాయింపులో వీరభద్ర గౌడ్ వివక్ష చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. ఈ అంశంపై వీరభద్ర గౌడ్ స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పల్లె పండుగ పనులు నిరుద్యోగ దళితులకు కేటాయించామని, ఇందులో తప్పేముందని ప్రశ్నించారు. కాగా.. సర్పంచ్ నిర్వహించిన నిరసనలో చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొనడంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమయ్యాయి.



మోకాళ్లపై నిరసన తెలియజేస్తున్న ఆలూరు సర్పంచ్ అరుణాదేవి

18న ఆశా వర్కర్ల ధర్నా

హాలహర్వి: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు పూనుకుంటున్నట్లు ఆశా వర్కర్ల సంఘం నాయకురాలు, సీఐటీయూ ఆలూరు తాలూకా అధ్యక్షులు నారాయణస్వామి, కృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ తిమ్మయ్యకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చు చేయాలన్నారు. ఆశాలతో సమానంగా వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించాల్నారు. బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆస్పరి: తమ సమస్యలు పరిష్కారించాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ బాలకృష్ణారెడ్డికి సీఐటీయూ నాయకుడు హనుమంతు, కార్యకర్తలు లక్ష్మీ, భారతి, రాజేశ్వరి, గోవిందమ్మ వినతిపత్రం అందజేశా రు. వారు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కా రం కోసం ఈనెల 18వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు

- పలు ఆలయాల్లో జ్వాలా తోరణం
- కిటకిటలాడిన శివాలయాలు
- జ్యోతుల వెలుగుల్లో కాంతులీనిన ఆలయాలు

పత్తికొండ(తుగ్గలి) : కార్తీక పౌర్ణమిని భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలు, ఇళ్లలో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. పత్తికొండ బైపాస్‌రోడ్డులోని పురాతన శివాలయం, మండగిరిలోని రామలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు పత్తికొండ, తుగ్గలి మండలాల్లోని శివాలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేకువజామునే శివాలయాలకు చేరుకొని స్వామికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఆలయ పరిసరాల్లో కార్తీక దీపాలు వెలిగించారు.

మద్దికెర : శివునికి ప్రీతి పాత్రమైన కార్తీక పౌర్ణమి, సోమవారం కావడంతో భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. కార్తీక పౌర్ణమి వేడుకలను మహిళలు నియమనిష్ఠలతో చేశారు. మండల కేంద్రం, బుగ్గలోని సంగమేశ్వరాలయంలో మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీదేవి, గంగాదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. ఉసిరి చెట్టుకింద చేరి ప్రసాదాన్ని ఆరగించారు.

కృష్ణగిరి: కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లోని శివాలయాల్లో కార్తీక శోభ నెలకొంది. పౌర్ణమి సందర్భంగా ఉదయమే భక్తులు శివాలయాల్లో అభిషేకార్చనలు చేపట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే గౌరీ దేవి వ్రతం చేపట్టి అన్నదానం చేశారు. చుంచు ఎర్రగుడి గ్రామంలోని పురాతన రామప్ప దేవాలయానికి, వెల్దుర్తి సమీపంలోని బ్రహ్మగుండం క్షేత్రానికి భక్తులు అధిక వచ్చి పూజ కార్యక్రమాలు చేపట్టారు.

ఆస్పరి: మండలంలోని బిణిగేరి సమీపంలోని కొండల్లో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం రాత్రి జ్వాలా తోరణం, దీపాలను వెలిగించారు. ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు నాయన ఆధ్వర్యంలో పంచలింగేశ్వర స్వామికి అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహా మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య జ్వాలా తోరణం కార్యక్రమంలో ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి, భక్తులు పాల్గొన్నారు. ఆస్పరి, చిగిళి, నగరూరు, చిరుమాన్‌దొడ్డి, శంకరబండ, తంగరడోణ, ఆదోని తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది.



మద్దికెర: కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



విశేష అలంకరణలో సాయిబాబా

ఆస్పరి: కార్తీక మాసం సందర్భంగా మండల కేంద్రం సమీపంలో ఉన్న షిర్డి సాయిబాబా ఆలయం అవరణలో శుక్రవారం భక్తులు లక్ష దీపాలు వెలిగించారు. ఆలయంలో బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే రామతీర్థంలోని గాయత్రీ, రామలింగేశ్వర స్వామి, పక్కీరప్ప తాత, జొహరాపురంలోని పెద్దమ్మవ్వ ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు.

దేవనకొండ: మండలంలోని దేవనకొండ, పి.కోటకొండ, తెర్నేకల్ తదితర గ్రామాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పి.కోటకొండలో ఉమారామలింగేశ్వర ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీలక్ష్మి కౌలుట్ల చెన్నకేశవస్వామి భక్తుల ఆధ్వర్యంలో స్వామివార్లకు అభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, పుష్పాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం లక్ష జ్యోతులను వెలిగించారు.



పత్తికొండ బైపాస్‌రోడ్డులోని పురాతన శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



మద్దికెరలో గంగాదేవికి పూజలు చేస్తున్న దృశ్యం



పత్తికొండలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆలూరు రూరల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా స్థానిక కోట వీధిలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు శివ రుద్రయ్య స్వామి,మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో మహిళలు దీపోత్సవం చేపట్టారు.



బిణిగేరిలో జ్వాలా తోరణాన్ని, వెలిగిస్తున్న ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి, భక్తులు



పి.కోటకొండలోని ఉమారామలింగేశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



ఆలూరు భీమలింగేశ్వర స్వామి ఆలయంలో దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

సంక్షిప్తం

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు

తుగ్గలి : రబీలో వేరుశనగ సాగుచేసే రైతులు రాయితీ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల అసిస్టెంట్ల (ఆర్ఎస్‌కే)ను కలిసి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని తుగ్గలి, పత్తికొండ మండలాల వ్యవసాయశాఖ అధికారులు పవన్ కుమార్, వెంకటరాము తెలిపారు. నీటి వసతి కలిగిన రైతులు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం తదితర వివరాలు సమర్పించి రాయితీ పోనూ తమ వాటా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. భూ విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో రైతుకు గరిష్టంగా మూడు బస్తాలు (90 కిలోలు) పంపిణీ చేస్తామన్నారు. క్వింటా పూర్తి ధర రూ.9,600 కాగా 40 శాతం రూ.3,840 రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద రూ.5,760 ప్రకారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. తుగ్గలి మండలానికి 450 క్వింటాళ్లు, పత్తికొండకు 385 క్వింటాళ్లు మంజూరైనట్లు వివరించారు.

వారికి బెల్లం విక్రయించొద్దు

పత్తికొండ(తుగ్గలి) : నాటుసారా తయారుచేసే వారికి బెల్లం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.విశ్వేశ్వరరావు హెచ్చరించారు. ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాలకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం బెల్లం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఒక వ్యక్తికి 3 కేజీల కన్నా మించి బెల్లం విక్రయించవద్దని సూచించారు. ఎక్సైజ్ ఎస్ఐ సాయిప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

ఆలూరు రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఏపీఓ శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

21న చేపల పెంపకానికి వేలం

వెల్దుర్తి(కృష్ణగిరి): పట్టణ సమీపంలోని అటవీశాఖ పరిధిలోనున్న వీరగన్నగట్టు చెరువులో చేపల పెంపకానికి ఈ నెల 21వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు ఫారెస్టు రెంజ్ అధికారి జి. విజయకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో మూడుసార్లు వేలం నిర్వహించగా ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో మరోమారు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు కర్నూలు రేంజ్ కార్యాలయంలో 21న ఉదయం 11 గంటలకు జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి చేయండి

హొళగుంద: స్వతంత్ర్య సమరయోదుడు భగవాన్ బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా హొళగుందలో ఏర్పాటు చేసిన గ్రామసభలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని పలువురు ఎస్టీలు అధికారులను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో సర్పంచ్ చలువాది రంగమ్మ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎంపీడీఓ విజయలలిత మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం వైద్య, విద్యా, రోడ్డు సౌర్యం కల్పిస్తామని తెలిపారు. అలాగే వినతి పత్రం అందజేస్తే హొళగుందలో ట్రిబెల్ వెల్ఫేర్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎంఈఓ సత్యనారాయణ హామీనిచ్చారు. ఐసీడీఎస్ సుపర్‌వైజర్ షీభారాణి, ఈఓపీఆర్డీ చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

మద్దికెర : వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నపుడే ఆరోగ్యం సిద్ధిస్తుందని వైద్యులు రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక కాలనీల్లో పరిశుభ్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వరుస వర్షాలతో వర్షపునీరు నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. అంతేగాక మురుగునీరు ఇంటి ముందు నిలిచినా దోమలు పెరిగి డెంగీ, చికున్‌గున్యా, కలరా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి ఎక్కువ కాలం నిల్వనున్న నీటిని పారబోసి శుభ్రం చేసుకోవాలని చెప్పారు.



శుక్రవారం ఉదయం హైవే 167ను కప్పేసిన పొగమంచు



తెల్లవారు జాము నుంచి మంచు కురుస్తుండడంతో నిర్మానుష్యంగా కోయనగర్ వీధి

కప్పేసిన మంచు దుప్పటి

వాతావరణ మార్పుతో వారం నుంచి చలి తీవ్రత అధికమైంది. దీనికి తోడు రాత్రి సమయంలో మంచు కురుస్తుండడంతో చలి తీవ్రత మరింత పెరిగింది. శుక్రవారం ఉదయం 8 గంటల వరకు ఆలూరును పొగ మంచు కప్పేసింది. దీంతో హైవే 167లో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. చలి కారణంగా జనం ఇళ్ల నుంచి బయటకు రాలేదు. – ఆలూరు రూరల్

విజయవంతం చేయండి

హాలహర్వి: ఈనెల 18వ తేదీన కర్నూలులో జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళన సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల గాదిలింగ కోరారు. శుక్రవారం స్థానిక ఆర్టీటీ భవనం ఎదుట నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఉచ్చీరప్ప, గంగాధర్, మల్లయ్య పాల్గొన్నారు.